# సంబంధాలు

"అమ్మా! ఫొటో అన్నయ్యకి నచ్చిందేవ్?" పొలికేక పెట్టి, చప్పట్లు కొడుతూ పకపకా నవ్వుతూ — "అన్నయ్య పెళ్ళికొడు కాయెనే! మా అన్నయ్య పెళ్ళి కొడుకాయెనే!" అంటూ చిన్న పిల్లలా అల్లరి చేసింది ప్రమీల.

"నిజంగానే నచ్చిందా?" అంటూ వచ్చింది వాళ్ళమ్మ సంబరంగా.

క్రిష్ణ ముసిముసిగా నవ్వేశాడు.

కొడుకు మొహం చూస్తే తల్లికి నేత్రానందమైంది.

పెళ్ళి విషయంలో అతగాడు అంత ప్రసన్నత ఎన్నడూ ప్రదర్శించలేదు.

వాళ్ళమ్మకి చాలా ధైర్యం వచ్చింది — 'రేపు పిల్లని చూడ్డానికి వెళ్దామా?" అంది.

కొడుకు ఒక నవ్వు విసిరి పేపర్లో తలదూర్చేసుకున్నాడు.

★ ★ ★

అబ్బాయిలందర్లాగే క్రిష్ణా రావుకూడా కలల్లో కొట్టుకు పోతూంటాడు. అతని ఊహల్లో ఓ స్వప్న సుందరి వుంది. ఆ సుందరి, గులాబీల్లోని మృదుత్వం, పారిజాతాల్లోని తెల్లదనం, కలువరేకుల్లోని సౌందర్యం, సన్నజాజుల్లోని పరిమళం, అన్నీ కలబోసుకుని వుంటుంది. మేను బంగారు తీగలా మిసమిసలాడుతూ తళుకు లీనుతూ వుంటుంది.

రావుకి కవిత్వం రాదు. అయినా తన స్వప్న సుందరిని వీక్షించినంత మాత్రాన తనకు కవిత్వం వచ్చి తీరేలాగ ఆమె ఉండాలి. కనీసం 'కవిత్వం రాక పోయిందే ఈ సుందరిని వర్ణించడానికి' అని తనకు ఏడుపైనా వచ్చి తీరాలి.

తర్వాత .... ఆ స్వప్నసుందరి చదువుకున్నది! చాలా చదువుకున్నది!

చదువుకోని మనిషి రెండు కాళ్ళ పశువు. అలాంటి పశువులతో జీవిత సంబంధాలు రావు కిష్టం లేదు. అందుకే స్వప్న సుందరికి బోలెడు చదువు వుంటుంది.

మూడోది .... నాలుగోది .... ఆరోది .... చాలా ఆశలున్నాయి క్రిష్ణారావుకి.

కలలు కనటం రావుకి సరదా! ఆ కలల్ని చేతకాని కవితా ధోరణిలో కుదించి రాసుకోవటం ఇంకో సరదా!

ఒకసారి ప్రమీల రావు రాసి పడేసిన కాయితం ఒకటి చదివింది.

అన్నాల దగ్గిర తల్లికి చెప్పెయ్యబోయింది — "అన్నయ్యకి అందమైన పెళ్ళాం కావాలట. ఆవిడెలా వుండాలంటే ...."

నోరు నొక్కేశాడు రావు — "ఏం, నీకు అంద మైనవాడు అక్కర్లేదా?" అన్నాడు.

ప్రమీల పెనుగులాడి విడిపించుకునే లోపు నాయనమ్మ తన అమూల్యమైన అభిప్రాయం వెల్లడి చేసింది. "మొగాడికి అందం ఏవిట్రా? మొగపుట్టుకే అందం!"

ప్రమీల చురచురా చూసింది నాయనమ్మని.

చదువు ముగించి ఉద్యోగంలో చేరి రెండు మూడేళ్ళు కావస్తోన్నా రావు కొత్త కొత్త కలలు కంటూనే వున్నాడు. కానీ .... ఇన్నాళ్ళకి .... అతను .... కలలు కన్న సుందరి కన్పించింది.

ఫొటోలో అమ్మాయి రావుకి చాలా నచ్చింది.

★ ★ ★

పెళ్ళి చూపులకు అన్నా చెల్లెళ్ళు వెళ్ళారు.

పెళ్ళి చూపులు జరిగాయి.

కమల బంగారం బొమ్మలాగే వుంది. అప్పుడే విచ్చుకున్న కమలంలాగ వుంది. క్రిష్ణారావుని మత్తెక్కించే స్వప్న సుందరిలాగే వుంది.

అదీగాక కాలేజీలో చదువుకుంటోంది. పెద్దవాళ్ళడిగిన మాటలకన్నిటికీ పిట్టలా సన్నని కంఠంతో జవాబులు చెప్పింది. కంఠం కోయిల గొంతులా శ్రావ్యంగా వుంది.

పెళ్ళిచూపులు ముగిసేసరికి, పెళ్ళి కొడుకు మొహంలో మందహాసం మాయమైంది. ఆ మొహాన్ని విసుగూ, చిరాకూ, ఆక్రమించాయి.

"అన్నయ్యా! వదినెలా వుంది?" అంది బండి ఎక్కగానే ప్రమీల.

"ఛీ! వూరుకో! ఏమిటా వరసలు?" అని ఖయ్యి మన్నాడు అన్నయ్య.

"ఏం, వదిన వరసేగా?"

"అలా అనొద్దు! వదిన అవదు. నాకేం నచ్చలేదు."

తెల్లబోయింది ప్రమీల.

ఇంటికి వెళ్ళీవెళ్ళగానే తల్లి అడిగింది "ఏమిటి, ప్రమీలేదో అంటోందీ!" అని.

"అవును."

"అవునేమిటి? నీ కెందుకు నచ్చలేదూ?"

"నన్నేం అడక్కు! నచ్చలేదు. అంతే!"

"ఇదేం ఖర్మరా దేవుడా! వీడికిక పెళ్ళయ్యే రాత వుందో లేదో! చివరికి వీడు బ్రహ్మచారిలా వుండి పోతాడా ఏమిటి? ఈ సంబంధం కూడా తప్పిపోయి నట్టేనా? ప్రమీల పెళ్ళీ, వీడిపెళ్ళీ కలిపి చేసేద్దాం అను కున్నాంగా? అన్నయ్య రేపో మాపో ప్రమీల సంబంధం కబురు తేనే తెస్తాడు" అంటూ ఆవిడ అత్తగారికి చెప్పుకుని వాపోయింది.

ఆ సాయంత్రానికి ప్రమీల మేనమామ రానే వచ్చాడు విశాఖపట్నంనించి నవ్వుమొహంతో.

అన్నగారి మొహంచూస్తే సంబంధం కుదుర్చేసు కుని మరీ వచ్చాడనిపించింది పెళ్ళికూతురు తల్లికి.

"ఏం అన్నయ్యా! ఏం చేసుకు వచ్చావు? కాయా, పండా?"

"పండుగాక కాయ అవుతుందా? కుర్రాణ్ణి చూసి వచ్చాను."

ప్రమీల తలుపుచాటున నక్కింది.

క్రిష్ణ మేనమామ దగ్గరికి వచ్చి కూర్చుని ఆతృతగా అడిగాడు.

"ఏం మాట్లాడావు మామయ్యా?"

"నేను వాళ్ళ నాన్న గారికి తెలిసిన వాణ్ణనీ, చూసి పోదామని వచ్చాననీ చెప్పాను. వివరాలు తర్వాత చెప్దామనుకున్నాను గానీ ...."

"ఊఁ, కానీ ఏమిటి?"

"ఆ కుర్రాడు బొత్తిగా పసిబాలుడేం కాదుగదా? ఉద్యోగం చేసి జీతం తెచ్చుకుంటున్నాడు గదా?"

"అందుకే కదూ? పిల్ల సుఖపడుతుందనీ ...." పిల్ల తల్లి మొహం వికసించింది.

"చెప్తాను విను మరీ! గదినిండా సిగరెట్టు పీకలూ చిత్తుకాయితాలూ చొక్కాలూ లాగులూ పుస్తకాలూ, అబ్బా! ఏం గందరగోళం .... 'అయ్యో! పోనీలే మొగ వాడేం సర్దుకోగలడులే' అనుకున్నా కడుపులో. బస్సు దిగి చీకట్నే వెళ్ళాను కదా మళ్ళీ దొరుకుతాడో దొరకడో అని. నేను వెళ్ళేసరికి ఇంటి వారి చీడీలమీద కూర్చుని మొహం కడుక్కుంటున్నాడు. నన్ను గదిలో కూర్చో బెట్టాడు. కాఫీ తెప్పించి ఇచ్చాడు. 'కూర్చోండి, స్నానం చేసి వస్తాను' అని సబ్బుపెట్టి పట్టుకుని బాత్ రూంలోకి వెళ్ళి రెండు నిమిషాల్లో వచ్చాడు. స్నానం లేదు, ఏమీలేదు. లోపలి గుడ్డలన్నా విప్పలేదు. రామ చంద్రా! ఒంటి మీదవున్న ఆ బనీను చూస్తే వాంతి రాబోయింది. నల్లగా మురికిగుడ్డలా మాసి, చెమటతో మచ్చలు కట్టి వుంది. కుర్రాణ్ణి పైకీ కిందకీ ఎగాదిగా చూశాను. జుట్టు చూస్తే అట్టలు కట్టినట్టు వుంది. వెంట్రుకల చివర మట్టిముద్దలు నా చత్వారం కళ్ళకి కూడా కన్పించి చచ్చాయి!"

"అయితే ఇంతకీ ...."

"పెళ్ళి కబురే ఎత్తలేదు నేను. 'నువ్వు కులా సాగానే వున్నావని మీ నాన్నగారికి చెప్తానబ్బాయ్' అనేసి బయటపడ్డాను."

బుగ్గలు నొక్కుకుంది ప్రమీల తల్లి "మరి కాయా, పండా అంటే, పండన్నావే?" అని తెల్ల బోయింది.

"పండు కాదూ మరీ? అలాంటి జిడ్డు దౌర్భా గ్యుడికి పిల్లనివ్వడం తప్పింది. ఇదిగో అమ్మాయ్! నువ్వు విచారించకు. శుభ్రత లేనిచోట ఆరోగ్యం నిల వదు. ఆరోగ్యం లేనిచోట అష్టదరిద్రాలూ చుట్టు కుంటాయి. వాడికి నలుగులు పెట్టి స్నానాలు చేయిం చడమేనా ఏవిటి ప్రమీల పని? అసలు స్నానానికి రమ్మంటే వింటాడో లేదో?"

"ఊఁ, బాగుంది. అయితే ఇది విన్నావా? రావు కూడా పిల్ల నచ్చలేదనేశాడు."

"ఏం రా? ఫొటో చూసి నచ్చిందన్నావటగా?

అమ్మాయిని చూస్తే నచ్చలేదా?" కళ్ళద్దాలు సరిచేసుకుంటూ అడిగాడు మేనమామ.

క్రిష్ణ గొంతు సర్దుకున్నాడు. ధైర్యం పుంజుకున్నాడు. "నాకు కన్పించిన కారణం పైకి చెప్పే ధైర్యం లేకపోయింది ఇప్పటిదాకా. కానీ నువ్వు చెప్పినట్టు చెమట మచ్చల బనీను, ఒక సంబంధాన్ని చెడగొట్టిందంటే, నా మనసులో మాట చెప్పెయ్యటానికి నాకూ ధైర్యం వస్తోంది. ఆ అమ్మాయి సోఫాలో కూర్చుంది బాగానే వుంది. ఆ కాళ్ళూపటం ఏమిటి బాబూ? అస్తమానూ కాళ్ళూపటమే! బట్టల మిషను తొక్కే అలవాటో, ఏమిటో! పెళ్ళి చూపుల్లో అలాగా ప్రవర్తించటం? తలవొంచుకుని సిగ్గుపడి పోవాలని నేననడం లేదు. ఆ అమ్మాయి అలా కాళ్ళు ఊపుతోంటే నా మనస్సు అసహ్యంతో నిండిపోయింది. ఇక ఆ అమ్మాయి అందచందాలు నాకేం కన్పించలేదు. ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని బయటపడ్డాను. చూసీ చూడగానే అసహ్యం వేసిన పిల్లని ఎలా పెళ్ళి చేసుకోనూ? రేపట్నించీ ఆ కాళ్ళు నా ముందే ఊపదూ?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

అంతా కుదిరిందనుకున్న సంబంధం అలా అయిపోయినందుకు తల్లికి బాగా కోపం వొచ్చింది.

"నువ్వు వొప్పుకోకపోతే ఆ పిల్లకి పెళ్ళవదనుకుంటున్నావా?" అంది వెటకారంగా.

కొడుకు కొంచెం నవ్వాడు — "నేనలా అన్నానా? ఆ అమ్మాయి ఏ పెళ్ళి చూపుల్లో అయినా కాళ్ళూపడం మానదు. 'కాళ్ళూపే భార్య కావాల'ని కోరుకునే వాళ్ళు ఆ అమ్మాయి దొరకడం అదృష్టంగా భావిస్తారు! నా సంగతే నేను చెప్పాను. నా కిష్టం లేదన్నాను. నా ఇష్టం నాది."

ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

మేనమామ చిరునవ్వుతో చూశాడు.

['కరుణామయి' మాస పత్రికలో 1965 ప్రాంతాల్లో కావచ్చు.] ★

**ఈ కథ గురించి:** కాళ్ళు ఊపే వాళ్ళనీ, స్నానాలు చెయ్యని వాళ్ళనీ, అన్నాలు తింటూ తెగ చప్పుళ్ళు చేసేవాళ్ళనీ, .... ఇంకా అలాంటి మేళాన్ని పెళ్ళిళ్ళు చేసుకోకూడదని చెప్పాలని తెగ తాపత్రయం పుట్టి, ఈ కథ రాశాను. నా కోసం అంతా ఈ కథలోకి రాలేదు. కానీ వాళ్ళు ఎలాంటి వాళ్ళో ముందు మనకు ఎలా తెలుస్తుంది? కాళ్ళ సంగతి తెలిసిపోతుందిలెండి. వాళ్ళు నిలకడగా ఒక్క క్షణం కూడా వుండలేరు. మరి, స్నానాల దగ్గిర బద్ధకాలు, వాళ్ళ దగ్గిర పరిమళాల ద్వారా తెలిసిపోతాయి. ఇక అన్నల చప్పుళ్ళ సంగతి కనిపెట్టాలంటే, వాళ్ళని ఇంటికి పిల్చి అన్నాలు పెట్టాలా? ఏమో! ఈ కథలో క్రిష్ణారావు, 'అందానికే' ప్రాధాన్యత ఇస్తాననుకున్నాడు గానీ, చివరికి 'ప్రవర్తన'కే ప్రాధాన్యత ఇచ్చాడు.

29-6-2004

# అసలు కారణం!

"అన్నీ సిద్ధంచేసి వుంచమ్మా! నేను మళ్ళీ వెళ్ళి వస్తాను. ఈసారి తప్పకుండా ఇస్తాళ్ళే" అంటూ గంగరాజు దగ్గరికి బయల్దేరారు మామగారు కొత్త చొక్కా కోసం.

ఆరోజు నాగులచవితి. పుట్టలో పాలుపోసే ఆచారం ఆయన చిన్నతనం నించీ పాటిస్తూ వున్నారట. నా మట్టుకు నాకీ పూజా పునస్కారాలంటే భక్తి శ్రద్ధలు లేకపోయినా మామగారి కోసం ఆరోజు చీకటితోటే లేచి, యజ్ఞం చేసినంత హడావుడి పడిపోతూ తొమ్మిది గంటల కల్లా నువ్వుల చిమ్మిలీ, బియ్యం చలిమిడీ, వడపప్పూ, కొబ్బరి ముక్కలూ తయారు చెయ్యగలిగాను. మామగారు కిందటిరోజే బజారునించి వస్తూ అరటి పళ్ళూ, సపోటా పళ్ళూ, చెరుకు ముక్కలూ, రెండు కోడిగుడ్లూ తెచ్చుకున్నారు. అన్నట్టు పుట్టమీద పెట్టి తర్వాత కట్టుకోటానికి ఒక గళ్ళపంచె కూడానూ. అవుపాలు కాఫీలకు ముందే వేరే వెండి చెంబులోకి